

ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయాడానికి అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చి సహకరించాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల ప్రక్రియలో నూతన సంస్కరణలు తీసుకొచ్చే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి అవసరమైన సూచనలు సలహాలను ఆహ్వానిస్తుందన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950, 1951, ఓటర్ల నమోదు నియమాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి వంటి ఇతర అంశాలపై ఎన్నికల సంఘం సూచనలను ఆహ్వానించిందని ఆయన తెలిపారు. మార్చి 31 లోపు జాతీయ, స్థానిక పార్టీలు అందించిన సూచనలు, సలహాలను ఇసికి నివేదించడం జరుగుతుందన్నారు.

ఉద్యోగ భద్రతపై బెంగ

- ఇన్సూరెన్స్ విధానంలోకి ఎన్‌టిఆర్ వైద్య సేవ?
- భవిష్యత్‌పై సిబ్బందిలో ఆందోళన
- అమలు కాని కనీస వేతనాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సామాన్య రోగులకు ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు క్షేత్రస్థాయిలో తమ వంతు కృషి చేస్తున్న వైద్య మిత్రలకు ఉద్యోగ భద్రత బెంగ పట్టుకుంది. గత 17 ఏళ్లుగా ఆరోగ్యశ్రీ వ్యవస్థను నమ్ముకుని విధులు నిర్వర్తిస్తున్న మిత్రాల పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా మారింది. ఎన్‌టిఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) స్థానంలో ఇన్సూరెన్స్ విధానాన్ని తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎంత మందిని ఉద్యోగాల్లో ఉంచుతారు. ఎంతమందిని తొలగిస్తారనేది స్పష్టత లేదు. దీంతో ఉద్యోగ భద్రతపై వైద్య మిత్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 210 మంది వైద్య మిత్రలు, 20 టీమ్ లీడర్లు పని చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా ప్రయివేట్, ప్రభుత్వ అనుబంధ ఆసుపత్రుల్లో ఆరోగ్యమిత్రలు 17 ఏళ్ళుగా పని చేస్తున్నారు. డిగ్రీ అర్హతతో ఆహ్వానించిన దరఖాస్తుల మేరకు జిల్లాల్లో రాత పరీక్ష రాసి జిల్లా కమిటీల ద్వారా ఉద్యోగాలు చేస్తున్నారు. అనుబంధ ఆసుపత్రుల యాజమాన్యాలు, రోగులు, ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయం మధ్య అనుసంధానంగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ప్రభుత్వాలు మారినప్పుడల్లా వైద్య మిత్రలకు ఉద్యోగ భద్రతపై ఆందోళన చెందాల్సిన పరిస్థితి వెంటాడుతూనే ఉంది. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని తీసివేసి ఆరోగ్య బీమాను తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఈ మేరకు ఉన్నతాధికారులు, నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో ఇప్పటికే చర్చలు జరిపింది. ఓ బీమా కంపెనీతో సైతం ఒప్పందం కుదిరినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నూతన విధానాన్ని అమలు చేసే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో తమ భవిష్యత్తు ఏమిటనే ప్రశ్నలు ఉద్యోగుల నుంచి వినిపిస్తున్నాయి. ఉద్యోగ భద్రత కోసం ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం తమ సేవలను గుర్తించి ఎవరికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు కనీస వేతనాలను అమలు చేయాలని కోరుకున్నారు.

అరకొర వేతనాలే

గత వైసిపి ప్రభుత్వం వైద్యమిత్రాలకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయలేదు. దీంతో అరకొర వేతనాలతోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తుంది. మరోవైపు సంక్షేమ పథకాలకు కోత పెట్టారు. బండెడు చాకిరీ చేస్తున్నా కనీస వేతనాలు అందరి పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగాలు క్రమబద్ధీకరణ కాక వేతనాలు సరిపోక అటు సంక్షేమ పథకాలూ అందక కష్టాలతో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలపై అధికారులకు పదేపదే వినతి పత్రాలు అందచేస్తున్నా పట్టించుకోని దుస్థితి ఏర్పడింది. ప్రస్తుతం నెలకు రూ.15వేలు మాత్రమే వేతనం వస్తుంది. ఆరోగ్య మిత్రలను ఆన్‌లైన్‌లో ప్రభుత్వ ఉద్యోగులుగా చూపుతున్నారు. దీనివల్ల వీరికి అమ్మఒడి కింద ఆర్థిక సాయం, పెన్షన్, ఆరోగ్యశ్రీ వంటి ఉచితంగా చికిత్స పొందే అవకాశాన్ని కోల్పోయారు. తెల్లరేషన్‌కార్డును కూడా జారీ చేయడం లేదు. ఇతర ఉద్యోగాల భర్తీలో ఆరోగ్యమిత్రలుగా పనిచేసే వారికి ప్రాధాన్యం కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వం గుర్తించిన ఉద్యోగ కేటగిరిల జాబితాలో లేనేలేదు. దీనివల్ల వీరికి అసలు ఉద్యోగ భద్రత లేకుండా పోతోంది. డిగ్రీ అర్హత కలిగినప్పటికీ పొరుగుసేవల కింద పని చేస్తున్నారు. ఎటువంటి క్యాడర్ లోనూ లేరు. 3వ తరగతి ఉద్యోగులుగా మాత్రమే చూపుతున్నారు. అటెండర్ క్యాడర్ కూడా కాదు. క్లర్క్‌గా ఉన్న క్యాడర్ 1గా గుర్తింపు ఇవ్వాలని అనేకసార్లు ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఆరోగ్యమిత్ర హోదాకు తగ్గ కేటగిరి సృష్టించాలని, హామీ ఇచ్చిన ప్రకారం ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు.

సమస్యల పరిష్కారం కోసం సమ్మెలోకి...

ఉద్యోగ భద్రత కనీస వేతనాలు తదితర సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ నెల 10, 17, 24వ తేదీల్లో (మూడు సోమవారాలు) విధులు బహిష్కరించేందుకు నోటీసులు ఇచ్చాము. కూటమి ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తోంది. మరోవైపు ఆప్కాస్ రద్దు దిశగా ఆలోచనలు చేస్తున్నట్లుగా మాకు సమాచారం అందింది. అయితే సమ్మె వద్దని ఈ నెల 12న చర్చలకు రమ్మన్నారు. చర్చలు సారాంశాన్ని బట్టి వచ్చే సోమవారం అనుకున్న విధంగా విధులను బహిష్కరిస్తాం. దశల వారీగా ఆందోళనలు చేపడతాం.

- వంచర్ల వీరభద్రరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, ఏపి వైద్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్

ఏ సౌకర్యాలూ లేవు...

17 ఏళ్లుగా ట్రస్ట్ ద్వారా సేవలు అందిస్తున్నాం. అయితే ఇప్పుడు ఇన్సూరెన్స్ విధానంలోకి మార్పు చేస్తే ఆప్కోస్‌ను రద్దు చేస్తారని ప్రచారం జరుగుతుంది. ఇంకో కొత్త ఏజెన్సీలకు ఇస్తే అనుభవం పోతుంది. కావున ఆప్కోస్‌ను రద్దు చేసే ఆలోచనను విరమించుకోవాలి. ఇన్సెంటివ్‌ను 2 శాతం ఇవ్వాలి. ఇంక్రిమెంట్లు అందించడంతో బాటు, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలి.

- పాలెపు శివ, వైద్య మిత్ర, గౌరవ సలహాదారుడు

ఏళ్ల తరబడి పని చేస్తున్నా గుర్తుంపు లేదు

అనేకేళ్లుగా ఆరోగ్యశ్రీ ట్రస్టులో పనిచేస్తున్న మాకు ఎటువంటి గుర్తింపు లేదు. కనీస వేతనాలు అమలు కావడం లేదు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం వేతనాలు పెంచాలి. బీమా సేవలను తీసుకురావాలనే ప్రయత్నం చేస్తున్నారు. మాకు ఉద్యోగ భద్రతను కల్పించాలి.

- వల్లూరి బంగారుశ్రీ , స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

రుణాల పంపిణీని ముమ్మరం చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు బ్యాంకు రుణాల పంపిణీని ముమ్మరం చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా బ్యాంకులు, జిల్లా అధికారులను కోరారు. మంగళవారం కలక్టరేట్‌లో బ్యాంకులు, జిల్లా అధికారులతో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశాలు జెసి అధ్యక్షతన జరిగాయి. 2024-25 సంవత్సరానికి జిల్లా వార్షిక రుణ ప్రణాళిక అమలులో భాగంగా వివిధ అంశాలలో సాధించిన ప్రగతి, లక్ష్య సాధన పూర్తి చేసేందుకు చివరి త్రైమాసంలో చేపట్టవలసిన కార్యాచరణలను ఆయన సమీక్షించారు. గత డిశంబరు 31వ తేదీతో ముగిసిన త్రైమాసాంతం నాటికి వివిధ రంగాలకు అందించిన రుణాల ప్రగతిని సమీక్షిస్తూ వ్యవసాయ రంగానికి రూ.11,460 కోట్ల రుణాల కల్పన లక్ష్యానికి గాను రూ.10,780 కోట్ల మేరకు రుణాలు కల్పించి 94.06 శాతం లక్ష్యాన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి రూ.4,183 కోట్లు రుణాలు జారీ లక్ష్యానికి గానూ రూ.4,102 కోట్లు పంపిణీ చేసి 98.03 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. ఇతర నాన్ ప్రియారిటీ రంగాలకు రూ.4,184 కోట్లు రుణాల కల్పనకు గాను లక్ష్యాన్ని మించి రూ.5,872 కోట్లు పంపిణీ చేసి 140.34 శాతం సాధించడం ముదావహన్నారు. ఈ యేడాది ఇప్పటి వరకూ 15,599 మంది కౌలురైతులకు వక్తిగతంగా రూ.55.48 కోట్లు, 20,495 మంది కౌలు రైతులకు ఆర్ఎంజి, జిఎల్‌జి గ్రూపుల ద్వారా మరో రూ.79.48 కోట్లు పంట రుణాలు మంజూరు చేసారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్వావలంబన పథకాల ద్వారా వివిధ సంక్షేమ కార్పోరేషన్ల ద్వారా 3,704 మంది లబ్ధిదారులకు రూ.4,568 కోట్లు రుణాలు కల్పన లక్ష్యం నిర్దేశించడం జరిగిందని, ఈ లక్ష్యాన్ని బ్యాంకులు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని ఆయన కోరారు. అలాగే ఆయా సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా 57 జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు 50 శాతం బ్యాంకు రుణాలుగా రూ.228 కోట్లు అందించాల న్నారు. డిఆర్‌డిఎ ద్వారా ఇప్పటి వరకూ 14,315 డ్వాక్రా గ్రూపులకు రూ.1075 కోట్లు (62.14 శాతం), మెప్మా ద్వారా 4,312 డ్వాక్వా గ్రూపులకు రూ.508 కోట్లు (240శాతం) బ్యాంకు రుణాల లింకేజి అందించడం జరిగిందన్నారు. పియం విశ్వకర్మ యోజన ద్వారా ఇప్పటి వరకూ 3,801 ధరఖాస్తులు ఆమోదం పొందగా, వీరికి ఆయా నైపుణ్యాలలో శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయ న్నారు. పిఎంఇజిపి పథకం ద్వారా 538 కోట్లు బ్యాంకు రుణంతో ఇప్పటి వరకూ 140 యూనిట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా గ్రౌండ్ అయ్యాయన్నారు. పిఎంఎఫ్ఎంఇ పథకం ద్వారా మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపనకు రూ.10 లక్షల వరకూ ష్యూరిటీ కోరకుండా రుణాలు అందిచాలని బ్యాంకర్లను కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ విశ్వకర్మ యోజన ద్వారా పూలదండల వ్యాపారులకు రుణాలు కల్పించాలని బ్యాంకర్లను కోరారు. కమిటీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ కాకి సాయిమనోహార్ టిడ్కో రుణాలు, మొండి ఎన్‌పిఎ రుణాల రికవరిలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది బ్యాంకర్లకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎల్‌డిఎం సిహెచ్ఎస్‌వి.ప్రసాద్, రిజర్వు బ్యాంకు ఎల్‌డిఒ పూర్ణిమ, నాబార్డు ఎజిఎం వై.సోమునాయుడు, డిఆర్ఒ జె.వెంకట్రావు, వ్యవసాయ, అనుబంధ రంగ శాఖల అధికారులు, పరిశ్రమలు, సంక్షేమ శాఖల అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఉష

మహిళల కోసం 'శక్తి' యాప్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అత్యవసర పరిస్థితులు, ఆపదలో ఉన్న మహిళలను రక్షించేందుకే శక్తి యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని మహిళా సంక్షేమ అధికారి ఉష అన్నారు. మంగళవారం రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శక్తి యాప్‌ను మహిళలు తమ సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఎక్కడైనా ఆకతాయిలతో ప్రమాదం పొంచి ఉన్నప్పుడు ఎస్ఒఎస్ ఆప్షన్‌పై నొక్కితే ఘటనా స్థలం లొకేషన్‌తో సహా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరుతుందని అన్నారు. 7 లేక 8 నిమిషాలలో పోలీసులు అక్కడకు చేరుకుంటారని అన్నారు. ఒంటరిగా మహిళలు ఆటోలు, కార్లలో ప్రయాణిస్తున్నప్పుడు న్యూ ట్రాక్ రిక్వెస్ట్ లో వివరాలు నమోదు చేసిన ఎడల ఆ వాహన గమనాన్ని పోలీస్ కంట్రోల్ రూమ్ పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, జి.కృష్ణమోహన్, ఎస్.శ్రీనగేష్ పాల్గొన్నారు.

భారీ స్థాయిలో జనసేన సభ

- రాష్ట్రం దివాలాకు జగన్ వైఖరే కారణం
- మంత్రులు నాదెండ్ల, దుర్గేష్ ధ్వజం

ప్రజాశక్తి - కాకినాడ

ఈనెల 14వ తేదీన పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ గ్రామంలో నిర్వహించనున్న జనసేన పార్టీ 14వ ఆవిర్భావ సభకు భారీ ఎత్తున ఏర్పాట్లను చేస్తున్నామని మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ వెల్లడించారు. ఈ సభకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ఆయా కమిటీలు పకడ్బందీగా చేస్తున్నాయని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వారు చెప్పారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వంలో ఉండి ఈ సభను నిర్వహిస్తున్నామని, దీనికి అధిక సంఖ్యలో హాజరవ్వడానికి తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సభ ప్రాంగణంతో పాటు పలు చోట్ల వైద్య శిబిరాలు, తాగునీరు, భోజన సదుపాయం, ఎల్ఇడి స్క్రీన్స్, మరుగు వంటివి ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న జనసేన అధినేత పవన్ అభిమానులు, జనసైనికులు ఈ సభకు లక్షల్లో హాజరవుతారని వివరించారు. ఈ సభ ద్వారా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సందేశాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 12న వైసిపి ఆధ్వర్యంలో చేపట్టే యువత పోరుపై వారు స్పందించారు. యువతతో పాటు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్ నేడు ఫీజు పోరు అంటూ కొత్త నాటకానికి తెరలేపారన్నారు. రాష్ట్రం నాశనం అవ్వడానికి జగన్ వైఖరి కారణమని వారు ఆరోపించారు. వ్యవస్థలను సర్వనాశనం చేసిన జగన్ ప్రభుత్వానికి యువత, మహిళలు, రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పారని అయినా ఆయనలో ఎటువంటి మార్పు రాకపోవడం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రం ఆర్థిక దివాళాకు జగన్ పాలనే కారణమని వారు ఆరోపించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి పి.హరిప్రసాద్, ఎంఎల్ఎలు పంతం నానాజీ, పత్సమట్ల ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

మహా ధర్నా జయప్రదం కోసం ప్రచారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉపాధి హామీ కూలీల సమస్యలు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై ఈ నెల 12న విజయవాడలో జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం తాళ్లరేవులోని పలు ప్రాంతాల్లో ఉపాధి కూలీలను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీలో 150 రోజులు పని దినాలు కల్పించాలని, వేతనాలు పెంచాలని, పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని, ప్రతి పేద కుటుంబానికి రెండు ఎకరాలు ప్రభుత్వ భూమి, మూడు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపరిచి 14 రకాల నిత్యవసర వస్తువులను ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఈ మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నేరేడుమిల్లి త్రిమూర్తులు, తవిటికి ఆదిలక్ష్మి, డి.వెంకటలక్ష్మి, కుమారి, అదృష్టదీపుడు, వెంకటలక్ష్మి, దీపిక, మంగయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న టేకుమూడి ఈశ్వరరావు

ఆకుకూరలు పిల్లలకు ఎంతో మేలు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆకుకూరలు పిల్లలకు ఎంతో మేలు చేస్తాయని ఎంపిడిఒ నాతి బుజ్జి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పెంచిన ఆకు కూరలను ఎంపిపి చలగళ్ళ పద్మనాభుడు, ఎంపిడిఒ నాతి బుజ్జి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎటువంటి ఎరువులు వేయకుండా కార్యాలయం ఆవరణలో పెంచిన ఆకుకూరలను అంగన్‌వాడీ కేంద్రానికి అందించినట్లు తెలిపారు. ఫిబ్రవరి నెల 3వ శనివారం స్వచ్ఛత దినోత్సవ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆకు కూరలు పెంచే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పార్వతి, ఎఒ చంద్రరావు, ఇసి రమేష్, అంగన్‌వాడీ కార్యకర్త, సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పునీటి ముప్పుపై రైతుల ధర్నా

ప్రజాశక్తి - తాళ్లరేవు

పంట పొలాలు పొట్ట దశలో ఉన్న సమయంలో ఉప్పునీరు సరఫరా చేయడం వల్ల పంటలు పొల్లు కాయలుగా మారిపోతాయంటూ రైతులు ధర్నా నిర్వహించారు. మంగళవారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో రైతులు పలివెల శేషారావు, ఎం.సత్యనారాయణ, పలివెల సింహాచలం మాట్లాడుతూ నీటి ఎద్దడి నివారణకు అధికారులు మల్లం కోట లాకుల వద్ద ఆత్రేయ, టేకి డ్రెయిన్‌ల నుంచి నీటిని పంట కాలువలోకి పంపింగ్ చేస్తున్నారని, దీనిలో ఉప్పు నీరు వస్తుందని అన్నారు. ఆత్రేయ పాయలోకి ఉప్పునీరు రాకుండా యానం, నీలపల్లి సరిహద్దులో ఉన్న టైడల్ లాక్ గేట్లు మూసివేయాలని కోరారు. అనంతరం సాగునీటి సంఘాల అధ్యక్షులు అల్లూరి రామకృష్ణరాజు, ధూళిపూడి గోపిలకు రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, రైతులు దడాల బుజ్జిబాబు, పాలెపు ఈశ్వరరావు, పలివెల కొండ, కాదా రామకష్ణ, దున్న నాగరాజు, పోతుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

ఉప్పుటేరు 3వ వంతెనకు సివికె.రావు పేరు పెట్టాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఉప్పుటేరు 3వ వంతెనకు చిత్తజల్లు వెంకటకృష్ణారావు(సివికె.రావు) పేరును పెట్టాలని సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు కోరారు. మంగళవారం సివికె.రావు 113వ జయంతి సందర్భంగా సినిమా రోడ్‌లోని సంత చెరువు పార్కు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి సామాజిక వర్గానికి చెందిన సివికె రావు విదేశాల్లో ఐసిఎస్‌ను పూర్తి చేశారని గుర్తు చేశారు. అనంతరం ఆయన విదేశాల నుంచి వచ్చి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని అన్నారు. కాకినాడ పురపాలక కౌన్సిలర్‌గా, ఛైర్మన్ గా, ఎంఎల్ఏగా ప్రజాహిత ప్రయోజన ఉద్యమాలు చేపట్టారని కొనియాడారు.

పూలమాలలు వేస్తున్న దూసర్లపూడి

కార్టూన్‘నిజం’



నాడు మోసం చేసి నేడు నిరసనలా.. : జ్యోతుల

ప్రజాశక్తి - కాకినాడ

అధికారంలో ఉండగా యువత జీవితాలను నాశనం చేసిన వైసిపి నేడు యువత కోసమంటూ నిరసన చేపట్టడం విడ్డూరంగా ఉందని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ మండిపడ్డారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయడం లేదంటూ వైసిపి 12వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిరసనకు పిలుపునివ్వడం అభ్యంతరకరమని అన్నారు. జగన్ ఐదేళ్లలో రాష్ట్రంలో అరాచక పాలన సాగించారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రూ.4270 కోట్లు ఉంచారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.700 కోట్లను విడుదల చేసి విద్యార్థుల సంక్షేమానికి పెద్ద పేట వేసిందన్నారు. అలాగే 16 వేలకు పైగా డిఎస్‌సి పోస్టులను భర్తీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నామని అన్నారు. ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందుల్లో ఉన్నా సంక్షేమాన్ని మాత్రం కొనసాగిస్తామని చెప్పారు. జగన్ హయాంలో యువతకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ధర్నాకు పిలుపునిస్తే గృహనిర్బంధాలకు గురిచేసి జైళ్లలో పెట్టించిన ఘనత జగన్‌దేనని అన్నారు. ప్రతిపక్ష పాత్ర ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని జగన్ మారాం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల దుష్ట పాలనకు ప్రజలు సమాధి కట్టిన జగన్ తీరులో మార్పు రాకపోవడం అతని అవివేకానికి నిదర్శనం అని చెప్పారు. 2014 ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తే 2019లోని వైసిపి పాలనలో కేవలం 9 లక్షల మందికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన జగన్ ఒక్క జాబ్ కేలండర్ కూడా విడుదల చేయకుండా యువతను మోసం చేశారన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఎండి జహీరుద్దీన్ జిలానీ, చప్పిడి వెంకటేశ్వరరావు, ఉండవల్లి వీర్రాజు, నురుకుర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ

ప్రయోగాలు చేస్తున్న విద్యార్థినులు

విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్లో మంగళవారం స్థానిక విట్ కర్ గరల్ సైస్కూల్, లూథరన్ హై స్కూల్ విద్యార్థినులకు 10వ తరగతి భౌతిక శాస్త్రానికి సంబంధించిన రసాయన సమీకరణాలు, చర్యలు పాఠ్యాంశం ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో రసాయన సంయోగం, వియోగం, స్థానభ్రంశం, ద్వంద్వ స్థానభ్రంశం, ఆక్సీకరణం, క్షయకరణం, దహన చర్య తటస్థీకరణ చర్య ఆక్షేపన చర్య, ఉష్ణ గ్రాహక చర్య ,ఉష్ణ మోచక చర్య వంటి ప్రయోగాలు విద్యార్థిలతో చేయించారు. జంతు ప్రేమికుడు నవీన్ నాని సర్పాలజీ శాస్త్రానికి చెందిన అనేక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లూథరన్ హైస్కూల్ హెచ్ఎం విక్టర్‌బాబు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రమణయ్యపేట అడబాల ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం విశ్రాంతి తహశీల్దార్ రేలంగి బాపిరాజు ఆర్థిక సాయంతో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణరాజు మాట్లాడుతూ సమాజ హితం కోసం తనకు వస్తున్న పింఛనులో కొంత మొత్తాన్ని పేదల కోసం వెచ్చించడం అభినందనీయమని అన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ సువర్ణరాజు, అడబాల రత్నప్రసాద్, ఎస్.శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ చేస్తున్ననిర్వాహకులు

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని టిడిపి నేత బొదిరెడ్డి గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మహిళా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం మహిళలకు అన్ని విధాల అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 2025 బడ్జెట్‌లో మహిళలకు రూ.4,332 కోట్లు కేటాయించారని అన్నారు. ప్రతి మహిళ ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రతి ఇంటిలో ఒక మహిళను పారిశ్రామికవేత్తగా తయారు చేసే విధంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు వాగు రాజేష్, జొన్నాడ వీరబాబు, కౌన్సిలర్లు ఎండగుడి నాగబాబు, కోణాల వెంకటరమణ, పెంద్ర శ్రీను, ఎంఆర్‌పిఎస్ నాయకుడు అనంతారపు రాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

750 లీటర్ల డీజిల్ సీజ్

ప్రజాశక్తి - గోపాలపురం

అనుమతులు లేకుండా నిల్వ చేసిన 750లీటర్ల డీజిల్‌ను సివిల్ సప్లయిస్ అధికారులు సీజ్ చేశారు. డిఎస్‌ఓ ఎం.నాగాంజనేయులు మాట్లాడుతూ గోపాలపురం శివారులో ఎటువంటి అనుమతులు లేకుండా రోడేపల్లి వద్ద 750 లీటర్ల డీజిల్, 2610 లీటర్ల బ్లాక్ ఆయిల్ నిల్వలు ఉన్నాయని సమాచారం అందిందన్నారు. ఈ మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్రమ మార్గంలో డీజిల్ సేకరిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఎటువంటి రసీదులు లేకపోవడంతో వాటిని సీజ్ చేశామన్నారు. నిందితునిపై కేసులు నమోదు చేశామన్నారు. సీజ్ చేసిన ఆయిల్‌ను గోపాలపురం పెట్రోల్ బంక్ వద్ద భద్రపరుస్తున్నట్లు తెలిపారు. ఈ దాడులలో సివిల్ సప్లయిస్ డిటి దివాకర్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

250 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కడియం

కడియం మండలం కడియపులంక గ్రామ శివారులో అక్రమంగా నాటు సారా తయారు చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో కడియం సిఐ అల్లు వెంకటేశ్వరరావు, ఎస్ఐ నాగదుర్గాప్రసాద్ సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. సారా తయారు చేస్తున్న పిడింగొయ్యికి చెందిన గెద్దం వేణు, మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. 250 లీటర్ల నాటు సారా, ఒక బైకును స్వాధీనం చేసుకున్నామని సిఐ తెలిపారు. 5వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఒకరిని అరెస్టు చేశామన్నారు.

సీతానగరంలో...

అర్ధరాత్రిపూట గ్రామ శివారులో అదే గ్రామానికి చెందిన ఉల్లింక రామకృష్ణ అనే వ్యక్తి నాటు సారా వ్యాపారం చేస్తుండగా సీతానగరం హెచ్‌సి సత్యనారాయణ, సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారు. 70 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు.

మైనార్టీ నాయకుని ఇంటిపై దాడి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామంలో సోమవారం అర్ధరాత్రి నున్న వారి వీధిలో మైనార్టీ నాయకుడు ఎస్‌డి.జాఫర్ ఇంటి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై దాడికి ప్రయత్నించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా మసీదు వివాదాలు ఏర్పడటంతో జాఫర్‌ను వ్యతిరేకిస్తున్న కొందరు రెండు సీసాల్లో పెట్రోల్ పోసి వాటికి మండుతుండ బట్ట పెట్టి జాఫర్, ఆయన కుమారుడు అబ్బాస్ నిద్రిస్తున్న రేకుల షెడ్ గోడపై పెట్టి అంటించి వెళ్లిపోయారు. రెండు సీసాల్లో ఒకటి పేలిపోయి గాజు పెంకులతో అబ్బాస్ చేతికి స్వల్ప గాయం అయింది. పెద్ద శబ్దంతో సీసా పేలడంతో పరిసర ప్రాంతాల వాసులు భయాందోళనకు గురయ్యారు. మహమ్మద్ రోషన్‌తో పాటు మరో ఇద్దరు ఈ ఘటనకు పాల్పడినట్టు జాఫర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రామచంద్రపురం సిఐ వెంకట నారాయణ, ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అమలాపురం-చల్లపల్లి ప్రధాన పంట కాలువ నుంచి ఎస్.యానాం వెళ్లే పంట కాలువలో చల్లపల్లి వద్ద మంగళవారం గుర్తుతెలియని కుళ్లిపోయిన వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుని వయసు సుమారు 45 నుంచి 50 ఏళ్లు ఉంటుందని, మృతదేహం గుర్తుపట్టేందుకు వీలు లేకుండా ఉందని ఎస్ఐ, సిహెచ్.రాజేష్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మద్యం అక్రమ విక్రయాలపై కేసు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిపై అంగర పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాలివి. వడ్లమూరు గ్రామానికి చెందిన కొల్లాటి సురేష్ వద్ద నుంచి 10 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం మండలంలోని వేగాయమ్మపేట వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజులూరు మండలంలోని అంద్రంగి గ్రామానికి చెందిన కేశన మణికంఠ ద్రాక్షారామం వైపు నుండి వేగాయమ్మ పేట వైపు వస్తుండగా, జగన్నాయకులపాలెం గ్రామానికి చెందిన కేతన సాయి, కేతన కిరణ్ బైకుపై వస్తూ ఒకరికొకరు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కేశన మణికంఠ, కేతని సాయి తీవ్రంగా గాయపడగా 108లో వారిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఐజిపి

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని చిత్రాడ గ్రామంలో ఈనెల 14వ తేదీన జరుగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ బహిరంగ సభకు బందోబస్తు ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ఐజిపి జివిజి.అశోక్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. సభా ప్రాంగణం, వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. సభకు పెద్ద ఎత్తున జనసేన కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ప్రజలకు శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్యలు, ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేటట్లు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాకినాడ జిల్లాలోని పోలీస్ అధికారులతో సమావేశమై బందోబస్తుపై చర్చించారు. సభకు వచ్చే కార్యకర్తలకు, స్థానిక ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లించి, ఆర్‌టిసి బస్సులు ప్రయాణించే మార్గాన్ని ముందుగా ప్రజలకు తెలియజేయలన్నారు. ఏ విధమైన అత్యవసరమైన పరిస్థితిని ఎదుర్కొనేందుకుగాను ఫైర్ డిపార్ట్‌మెంట్, మెడికల్ డిపార్ట్‌మెంట్‌లతో సంప్రదించి ఫైర్ ఇంజన్లు, అంబులెన్సులు ఏర్పాటు చేయమని సూచించారు. ఈ పర్యటనలో ఎస్‌పి జి.బిందుమాధవ్, అదనపు ఎస్‌పిలు భాస్కర్, శ్రీనివాస్, మనీష్ దేవరాజ్ పాటిల్, డిఎస్‌పి శ్రీహరిరాజు, సిఐ జి శ్రీనివాస్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏలూరు రేంజ్ ఐజిపి

ప్రజా చైతన్య యాత్రలో సమస్యలను తెలుసుకుంటున్న సిపిఎం బృందం

37వ డివిజన్‌లో ప్రజాచైతన్య యాత్ర

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని 37వ డివిజన్‌లో సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ప్రజా చైతన్య యాత్ర జరిగింది. ఎన్నికల హామీలను అమలు చేయాలని కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సులభ కాంప్లెక్స్ పరిశుభ్రంగా ఉంచాలని, కొత్తగా పెళ్లయిన వారికి రేషన్ కార్డులు ఇవ్వాలని, డ్రెయినేజీల్లో పూడిక తీయించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని, బ్లీచింగ్ చల్లించాలని, మంచినీరు పరిశుభ్రంగా సక్రమంగా సరఫరా చేయాలని, ఇంటి నిర్మాణాలకు లోన్లు మంజూరు చేయాలని, వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూడాలని, టిడిపి కార్యాలయం వెనుక వీధిలో రెండు కరెంటు స్తంభాలు వేయించాలని స్థానిక ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు కె.నాగజ్యోతి, మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, దుంపల ప్రసాద్, మేడిశెట్టి వెంకటరమణ, సిహెచ్.సతీష్, టి.రాణి పాల్గొన్నారు.

జెసి రాహుల్ మీనాకు వినతిపత్రం ఇస్తున్న ధర్మారావు

ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణకు కృషి

ప్రజాశక్తి - తాళ్లరేవు

సముద్ర తీరం వెంబడి సామూహికంగా మరణిస్తున్న ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణకు కృషి చేయాలని వైల్డ్ కెనాఫీ హాబిటాట్స్ ఓషన్స్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు సంగాడి ధర్మారావు కోరారు. మంగళవారం జెసి రాహుల్ మీనాకు వినతి పత్రం అందజేశారు. ఆ వివరాలను తాళ్లరేవులో ఆయన మీడియాకు వెల్లడించారు. కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల తీరప్రాంతాల్లో ఆలివ్ రిడ్లీ తాబేళ్లు భారీ సంఖ్యలో మరణిస్తున్నాయని అన్నారు. సముద్ర జలాలను సంరక్షిస్తున్న ఈ పురాతన సముద్ర ప్రాణులు మానవుల నిర్లక్ష్యపు చర్యల కారణంగా మరణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పర్యావరణ వినాశనం, మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చిర్రయనాం, ఎస్.యానాం, కొత్తపాలెం ప్రాంతాలలో 200కు పైగా తాబేళు మృతి చెందినట్లు తమ సర్వేలో తేలిందన్నారు. వీటి మరణానికి పారిశ్రామిక కాలుష్యం, చమురు లీకేజీలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, నియంత్రణలేని ట్రాలింగ్ బోట్ల చేపలవేట కారణాలని అన్నారు. కాలుష్య నియంత్రణ చర్యలను కఠినంగా అమలు చేయాలనీ కోరారు. ఈ మరణాలపై సముద్ర నిపుణులచే పూర్తి స్థాయిలో అధ్యయనం చేయించాలని డిమాండ్ చేశారు.

బ్లడ్ బ్యాంక్‌లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని యువసేన బ్లడ్ బ్యాంక్‌లో డిఎంహెచ్‌ఒ డాక్టర్ జె.నరసింహనాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి, ప్రజల నుంచి వసూలు చేస్తున్న ఛార్జీల వివరాలపై ఆరా తీశారు. పేషెంట్ రిక్విజేషన్ ఫామ్ తీసుకుని ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. పేషంట్ పేమెంట్ రిసిప్ట్ ఇష్యూ రిజిస్టర్స్ అన్ని సక్రమంగా ఉన్నాయని ఆయన తెలిపారు. బ్లడ్ స్టాక్ రిజిస్టర్, డోనర్ రికార్డ్, క్యాంప్ రిజిస్టర్స్, క్రాస్ మ్యాచింగ్, డిస్కార్డ్ రిజిస్టర్, బ్లడ్ ఇష్యూ రిజిస్టర్, పేషెంట్ రిక్విజేషన్ ఫామ్, పేషెంట్ రిసీవ్డ్, ఫిజికల్ స్టాక్ క్రాస్, గవర్నమెంటు బ్లడ్ బ్యాంక్ ఇచ్చిన 30 శాతం బ్లడ్, నెలవారీ డోనర్స్ అండ్ నెలవారీ ఇష్యూ రిజిస్టర్, బ్లడ్ కలెక్షన్ రూమ్ క్రాస్ మ్యాచింగ్ రూమ్ కాంపోనెంట్ ప్రిపరేషన్ రూమ్ వైరల్ స్క్రీనింగ్ రూమ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి నిధుల కేటాయింపు

ప్రజాశక్తి - తుని

తుని మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.34,92,800 కేటాయించినట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ కుచ్చర్లపాటి రమాదేవి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో టిడిపికి చెందిన కౌన్సిలర్లతోపాటు, వైసిపికి చెందిన కౌన్సిలర్లు పాల్గొన్నారు. 11వ వార్డు రాజా గ్రౌండు వద్ద సిసి రోడ్ నిర్మాణానికి, పట్టణంలో ఎల్ఇడి వీధిలైట్లు నిర్మాణానికి, ఇతర పనులతో పాటు మొత్తం 10 పనులను కౌన్సిల్లో ఆమోదం తెలిపినట్లు ఛైర్‌పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎ.వెంకటరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

జనసేన ఆవిర్భావ సభకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - పిఠాపురం

ఈనెల 14న చిత్రాడ గ్రామంలో జరగనున్న జనసేన ఆవిర్భావ సభకు ఏర్పాట్లు పూర్తి చేసామని ఎపి టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ తెలిపారు. మంగళవారం కుమారపురం గ్రామంలోని గోకుల్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14వ ఆవిర్భావ దినోత్సవ సభ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించడం ఒక చారిత్రాత్మక ఘట్టమన్నారు. ఆవిర్భావ సభకు దేశ నలుమూల నుంచి రానున్న జనసైనికుల కోసం ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు. పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నడూ కనీ వినీ ఎరుగని రీతిలో పండగ వాతావరణంలో జనసేన పార్టీ ఆవిర్భావ సభ జరగబోతుందని అన్నారు. ఈసమావేశంలో పిఎస్ఎన్.రాజు, పిల్లా శ్రీధర్, ఊటా నానిబాబు, పిల్లా శివశంకర్ ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అజేయ్

'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

కాకినాడలో వైసిపి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే యువత పోరు పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక గోలి వారి వీధిలోని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టణ, మండలం నుంచి అధిక సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కాపుగంటి కామేశ్వరరావు, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కరరావు, పప్పుల దుర్గ, ఆరేళ్ల వీరరాఘవ, కొట్టి పవన్, కౌన్సిల్ కో-ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, బొబ్బిలి హరిబాబు, గుర్రాల యాకోబు, చింతా శ్రీనివాస్, తాటికొండ పెదకాపు, గొల్ల పెద్ద, వైసిపి యూత్ పట్టణ ప్రెసిడెంట్ కురందాసు సతీష్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ఎంఎల్‌సి రవిచంద్రను సత్కరిస్తున్న యనమల

యనమలను కలిసిన ఎంఎల్‌సి రవిచంద్ర

ప్రజాశక్తి - తుని

తేటగుంటలోని టిడిపి కార్యాలయంలో నూతనంగా ఎంపికైన ఎంఎల్‌సి బీద రవిచంద్ర మాజీ మంత్రి యనమల రామకృష్ణుడును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవిచంద్రను యనమల సత్కరించారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ పార్టీలో కష్టపడ్డ వారికి ఫలితం ఉంటుందని, అనునిత్యం ప్రజల శ్రేయస్సు కొరకు పాటుపడాలని, పార్టీ నిబంధనలకు అనుసరించి పనిచేస్తూ ముందుకు సాగాలని సూచించారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీలలిత

ఆడపిల్లల రక్షణపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆడపిల్లల రక్షణ, వారి రక్షణకు ఎదురయ్యే అంశాలు వాటిని ఎదుర్కొనే విధానం వంటి వాటిపై అవగాహన పెంచాలని ఎంపిడిఒ డి.శ్రీలలిత అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో కాకినాడ పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలికల రక్షణ పై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భద్రతా నియమాలు, సురక్షిత స్పర్శ, అసురక్షిత స్పర్శ, ఫోక్సోచట్టం, బాలికల ఆరోగ్యం, బాలికల రక్షణకు చేపట్టవలసిన చర్యలు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ప్రాజెక్టు సిసి లత, జిల్లా ఉన్నతి ఎపిఎం పి.సూర్యనారాయణ, హెచ్‌డి యాంకర్ పర్సన్ అనిల్, పడాల చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ సూర్య భాస్కర్, మండల సమాఖ్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న వైసిపి

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ అభివృద్ధిని వైసిపి నాయకులు అడ్డుకుంటున్నారని 13వ డివిజన్ టిడిపి అధ్యక్షులు కాళ్ళ రవీంద్ర అన్నారు. 13వ వార్డులో సిసి రోడ్డును కూటమి నాయకులు అడ్డుకుంటున్నారని కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంపై మంగలవారం ఆయన కమిషనర్‌ను కలిసి మాట్లాడారు. వార్డులో జరిగిన అభివృద్ధి పనులను ఆయన వివరించారు. వార్డులో జరిగిన అభివృద్ధిని వక్రీకరిస్తూ అసత్య ప్రచారాలు చేస్తున్నట్టు చెప్పారు.

కమిషనర్‌తో మాట్లాడుతున్న రవీంద్ర

మేధో సంపత్తి హక్కులపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా సంస్థల డెవలప్‌మెంట్ కార్పొరేషన్, మేధో సంపత్తి హక్కుల ఆద్వార్యాన మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్ జెడి సిహెచ్.గణపతి పాల్గొని మాట్లాడారు. అనంతరం నొవెల్ పేటెంట్ సర్వీసెస్ మేనేజర్ ఎస్‌విఎస్.రాజు మేధో సంపత్తి హకులపై అవగాహన కల్పించారు. డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మేధో సంపత్తి హక్కులు, వ్యాపార వ్యూహాలపై విద్యార్థులు అవగాహన పొందాలన్నారు. ఈ సదస్సులో కెరీర్ డెవలప్మెంట్ డీన్ ప్రొఫెసర్ జెడి వెంకటేష్, ఐపిఎఫ్‌సి కన్వీనర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

పూడికతో నిండిపోయిన డ్రెయినేజీ

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ పరిధిలోని 6వ వార్డులో కబేలా ఎదురుగా ఉన్న మేజర్ డ్రెయిన్ పూడికతో నిండిపోయింది. దీంతో కోటబజార్ ప్రాంతానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దోమలు విపరీతంగా వ్యాప్తి చెందాయని, దుర్వాసన, దోమలతో పలువురు అనారోగ్యానికి గురి అవుతున్నారని ప్రజలు వాపోతున్నారు. కోటబజార్‌లో ఉన్న ఒక కబేలాకు చెందిన వ్యర్థాలను కాలువలోకి విడిచిపెట్టడంతో దుర్వాసన అధికంగా వస్తుందని, తక్షణమే పూడికను తొలగించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రెయినేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు

ఉపాధి పనులను పరిశీలించిన ఎపిడి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కట్టమూరు, పులిమేరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఎపిడి భానుప్రకాష్ పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి ఉపాధి కూలీలతో ఉపాధి పనులు, వారికి లభిస్తున్న వేతనాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడి డి.సుధీర్, టిఎలు కె.దుర్గాప్రసాద్, వై.బాపూజీ, ఎం.సత్తిరాజు, కె.శ్రీనివాస్, సిఒ కె.వీరబాబు, జెఇ వివి.సతీష్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 56/2024
Between:
Patnala Neela @ Neelima, D/o. Patnala Peddiraju, aged about 48 years, Occ: Private Employee, R/o. Narayani Sai Home, Tellapur, Sangareddy District, Telangana. ...*Plaintiff*
AND
Mogalapu Sudarshan Wellington and Others ...*Defendants*
D-2: Mogalapu George Mithilesh, S/o. Mogalapu Sudarshan Wellington, aged about 44 years, Occ: Private, R/o. H.No. 56-11-8, Vidyanagar, Rajahmundry, Andhra Pradesh. ...*2nd Defendant*
పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 25-3-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొన వలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి 11-3-2025 **THARUN PAL BATTHULA** అడ్వకేట్, హైదరాబాద్

ఘనంగా వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాం వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. చింతా వెంకట సుబ్బారావు కుమారులచే కళ్యాణాన్ని నిర్వహించారు. యానాం ప్రజల తరపున ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, లక్ష్మీస్నేహ దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు, మంగళ సూత్రాలు సమర్పించారు. ప్రభుత్వం తరఫున ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి దంపతులు పట్టుపీతాంబ్రాలు, సువర్ణ యజ్ఞోపవీతంలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎంఎల్ఎ దంపతులు

KAKINADA URBAN DEVELOPMENT AUTHORITY
Short 'e' Procurement Notice
Notice No. KAUDA/ENG/2024-25/03 **dated: 10-03-2025**
Online Short tender is invited through e-procurement platform for 01 work of value Rs. 40.00 Lakhs of annual Maintenance of Beach and beach park at Kakinada. Bid document is available at www.eprocurement.gov.in from 12-03-2025, 10.00 AM. Cell: 62811 58881.
Sd/- **Vice Chairman**
KAUDA, Kakinada

శ్మశాన వాటిక అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని స్థానిక పెంకే వారి పేట శ్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు గ్రామస్తులు సహకరించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు పొన్నాడ పేరయ్య రాజు కోరారు. మంగళవారం స్థానిక లయన్స్ క్లబ్ హాల్లో క్లబ్ ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు శ్మశాన వాటిక అభివృద్ధిపై చర్చించారు. శ్మశానం ప్రాంతం మెరక చేయాలని, ఆక్వా చెరువుల నుంచి ఊట నీరు రాకుండా కాలువ నిర్మాణం చేపట్టాలని, చెత్త వేసే ప్రాంతాన్ని మరొక చోటకి తరలించాలని, ప్రహరీ గోడ నిర్మాణం చేయాలని కోరారు. లయన్స్ కైలాస భూమిగా అభివృద్ధి చేసేందుకు లైన్స్ క్లబ్ ముందుకు వస్తుందని, దానికి గ్రామస్థులంతా సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, మాజీ సర్పంచులు రెడ్డి రెడ్డిబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు నడింపల్లి వినోద్, బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి, నున్న దత్తు, తొగరు కృష్ణమూర్తి, సతీష్‌రాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పేరయ్యరాజు

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - గండేపల్లి

సురక్షితమైన కుత్రిమ మేథో వ్యవస్థలోని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ హుస్సేన్ సూచించారు. మంగళవారం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యశాలలో ఆయన మాట్లాడారు. బాధ్యతాయుతమైన, సురక్షితమైన ఎఐ వ్యవస్థలపై దృష్టి సారించాలన్నారు. సివిల్ ఇంజనీరింగ్‌లో అనేక ప్రామాణికత మరియు సాంకేతికలో కుత్రిమ మేథోపరమైన చొరవ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో. ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, విభాగాధిపతి డాక్టర్ బి.రామ్మోహన్‌రెడ్డి, పి.శివకుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల విలీనం సరికాదు

ప్రజాశక్తి - తాళ్లరేవు

గ్రామీణ పాఠశాలలను విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచన సరైంది కాదని విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ఏదైనా ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆ ప్రాంతంలోని విద్య ప్రమాణాల వృద్ధి ముఖ్యమన్నారు. ఈ ప్రక్రియ గ్రామీణ విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేయడమేనని అన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం, వెలగతోడు
టెండరు నోటీసు
రిక.నెం. 11/2025 తేది. 10-03-2025
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట మండలంలోని వెలగతోడు గ్రామపంచాయతీనకు 2025-26 సం॥నకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా సామాన్లు సప్లై చేయుటకు గాను టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లు ది. 15-03-2025 సం॥రం తేదీ శనివారం మధ్యాహ్నం గం॥ 12.00 వరకు వెలగతోడు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతిని మరియొకరిచే గాని టెండర్లు తీసుకొనబడి సదరు సీల్డు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం॥ 2.00 లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షములో తెరవబడును. టెండరు ప్రక్రియకు సంబంధించి ఇతర వివరములు కొరకు గ్రామపంచాయతీ పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును. ధరావత్తు చెల్లించని టెండర్లు స్వీకరింపబడవు.

వ.నెం.	అయిటము వివరము	టెండరు ధరావత్తు
1	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన ముగ్గు, బ్లీచింగ్, హైపోక్లోరైడ్ మొ॥లగు ప్రజారోగ్య సామాన్లు సప్లయి చేయుటకు	రూ.100/-
2	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన చేతి పైపు మరియు కుళాయి విడిభాగములు సప్లయి చేయుటకు	రూ.100/-
3	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన ఎలక్ట్రికల్ విడిభాగములు మరియు ఫిటింగ్స్ సప్లయి చేయుటకు	రూ.100/-
4	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి అవసరమైన పారిశుద్ధ్య పనులు చేయుటకు ఆరుగురు (6) వ్యక్తులు	రూ.100/-

యన్.కృపరాజు, సర్పంచ్, గ్రామపంచాయితీ, వెలగతోడు
సం/- **వి.వి.ఆర్.కె.రాజు,** పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయతీ, వెలగతోడు, మండపేట మండలం

మహారాజశ్రీ 5వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 860/2021
Between:
Kilaparthi Adhilakshmi ...*Plaintiff*
AND
1) Pacchimalla Venkata Rao, S/o. late Venkanna, Hindu, aged 60 years, D.No. 52-9-5, Masidu back side, Near 16 taps Street, Rajendra Nagar, Rajamahendravaram, E.G.Dt.,
2) Pacchimalla Simdhiya Rani ...*Defendants 1 & 2*
పై నంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీరు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమను/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా తిప్పివేయుచున్నారు. కావున **ది. 09-04-2025 సం॥ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కె.వి.వి.సత్యనారాయణ
రాజమండ్రి 11-3-2025 అడ్వకేటు, రాజమండ్రి సెల్: 90106 56529

మహారాజశ్రీ 1వ జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
M.V.O.P. No. 671/2022
Between:
Sorlam Kaveri and Another ...*Petitioners*
AND
Bathina Subhash @ Subbayya and Others ...*Respondents*
R-4: Naga Veera Venkata Durga Prasad, S/o. Srinivasa Rao, Rampa Yerrampalem Village o Gokavaram Mandal. ...*Proposed party/ 4th Respondent*
పై నెంబరు పిటిషన్‌లో 4వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 04-4-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొన వలెను. లేని యెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
బి.సీతారామయ్య
రాజమండ్రి 11-3-2025 బి.లక్ష్మీనారాయణ అడ్వకేట్స్, రాజమండ్రి

దావా నోటీసు
మహారాజశ్రీ తూర్పుగోదావరి జిల్లా అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టునందు
O.S.No.52/2023
Between:
మారిశెట్టి శ్రీనివాసరావు -వాది
మరియు
మల్లుల్లి రాధాకృష్ణ -ప్రతివాది
మల్లుల్లి రాధాకృష్ణ, S/O. ఆదినారాయణ, హిందు, వయస్సు 65 సంగలు, వ్యాపారం, డోర్ నెం. 11-48, గొల్లల మామిడాడ గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా, కాకినాడ JCJC.
పై దావా నందు ప్రతివాది అయిన మీ నుండి తనకు రావలసిన ప్రామిసరీ నోటు బాకీ మింజువలె అసలు, వడ్డీ మరియు ఖర్చులుతో సహా మీ నుండి ఇప్పించమని పై శ్రీ కోర్టువారిని కోరుచూ వాది పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలోగాని శ్రీ కోర్టువారు దావా నోటీసులు ఎన్నిమార్లు మీకు పంపించినప్పటికినీ మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక కాలయాపన చేయుచుండుటచే శ్రీకోర్టువారు ప్రతివాది అయిన మీకు ఈ ప్రకటన ద్వారా సదరు పై దావా వాయిదా తెలియజేయమని ఆర్డరు వేసియున్నారు. కావున పై దావా నందు ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం ది.18-03-2025వ తేదికి పై శ్రీ కోర్టువారిచే వాయిదావున్నది. అని ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. కావున మీరు సదరు వాయిదా రోజు అయిన **ది.18-03-2025వ తేదిన ఉదయం 10.30 గం॥ ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారాగాని పై శ్రీకోర్టువారి యెదుట ఎదుటహాజరై మీకు ఏమైన అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల శ్రీ కోర్టువారికి తెలియజేసుకొనవలసినదిగా తెలియ జేయడమైనది. లేకున్నచో మీ పరోక్షమున శ్రీకోర్టువారు తీర్మానింతురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ననుసరించి)
శ్రీ మేడపాటి రవి షణ్ముఖ రెడ్డి
అనపర్తి, **శ్రీ గొలుగూరి బుల్లి రెడ్డి**
ది. 11-03-2025 అడ్వకేట్స్, అనపర్తి